ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 ; కనిష్ఠం 24.0
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
మంగళవారం 19 ఆగస్టు 2025





గేట్లు ఎత్తడంతో పరవళ్లు తొక్కుతున్న వరదనీరు

మత్తడి వాగు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

● ఐదు వేల క్యూసెక్కుల నీటి విడుదల

తాంసి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, సోమవారం మధ్యాహ్నానికి 277.40కు చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు సోమవారం సాయంత్రం రెండు గేట్లు ఎత్తివేశారు. సుమారు 5,300 క్యూసెక్కుల నీటిని బయటకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 4,200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని అధికారులు పేర్కొన్నారు. వర్షం ఇలాగే కురిస్తే సాయంత్రం సమయంలో ఐదు గేట్లు ఎత్తివేస్తామని పేర్కొన్నారు. గేట్లు ఎత్తడంతో వరద నీరు పరవళ్లు తొక్కింది.

భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శనివారం మూడు గంటల పాటు కురిసిన వర్షానికే పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలు అతలాకుతలం అయ్యాయని తెలిపారు. లోలెవల్ వంతెనలు దాటేందుకు యత్నించొద్దన్నారు. అత్యసరమయితే తప్ప ఇళ్ల నుంచి రావొద్దని సూచించారు. 18 నుంచి 20వరకు వర్షాలు భారీగా కురుస్తాయని వాతవరణ శాఖ తెలిపిందన్నారు. దానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం కూడా సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడ ప్రాణ నష్టం జరగకుండా పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్డీఆర్ఎఫ్, డీడీఆర్ఎఫ్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 లేదా కలెక్టరేట్‌లోని టోల్ ఫ్రీ నెం. 18004251939 కు ఫోన్ చేయాలన్నారు.

వరదల.. బీభత్సం



● నేరడిగొండ మండలంలో నేలకొరిగిన పత్తి పంట

జిల్లాలో.. గత రెండు, మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షాలకు వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకదాటిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. సాయంత్రం 4 గంటల వరకు జిల్లా విశ్వసమయం వర్షపాతం 50.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అయితే ఈ నెల 16న కురిసిన అతి భారీవర్షంతో జిల్లా అంతా అతలాకుతలమైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా 17.3 సెంటీమీటర్ల వర్షపాతం తాంసి మండలంలో నమోదయ్యింది. ఈ స్థాయిలో భారీ వర్షం కురవడం ఈ సీజన్‌లో ఇదే మొదటిసారి.

- జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు
- వరదలు ముంచెత్తడంతో 19 వేల ఎకరాలకు పైగా పంట నష్టం
- కొట్టుకపోయినా రోడ్లు, దెబ్బతిన్న కల్వర్టులు, తెగిన చెరువు కట్టలు
- దారులు కొట్టుకపోవడంతో మారుమూల గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు
- మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రమాదకరంగా ప్రవహిస్తున్న పెన్ గంగా
- నేడు జిల్లాలో పర్యటించనున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆదిలాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తలమడుగు, ఇచ్చోడ సిరికొండ, బోథ్ భీంపూర్, జైనథ్, సాత్నాల, ఇంద్రవెల్లి ఉట్నూర్, నార్నూర్ ఆదిలాబాద్ రూరల్, అర్బన్ మండలాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈయేడు జిల్లాలో జూన్ 1 నుంచి ఆగస్టు 18 వరకు 482.7 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా అత్యధికంగా 578.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు నదులు వరద నీటితో ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. లో లెవెల్ వంతెనల వద్దాం పోలీసులు భద్రత చర్యలను చేపడుతున్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. మరో రెండు మూడు రోజులపాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి-చించుఘాట్ గ్రామాల మధ్య కొట్టుకపోయిన బ్రిడ్జి

వేలాది ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో ఆగస్టు 16, 17వ తేదీల్లో రెండు రోజుల్లో కురిసిన అతి భారీ వర్షాలతో వేల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం జరిగింది. జిల్లాలోని 18 మండలాల పరిధిలో

(తరువాయి 6వ పేజీలో....)



చిక్‌మన్ వాగు వద్ద గల కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు

పలు గ్రామాలకు రాకపోకలు బంద్

ఏజెన్సీ మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్లు, కల్వర్టులు కోతకు గురై కొట్టుకు పోవడంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎలాంటి వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేక కాలినడకనే వెళ్తున్నారు. ఇంకా చాలా గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాల్లో వరదలు ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. లోలెవెల్ వంతెనలను దాటవద్దంటూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. సరైన రోడ్డు మార్గాలు లేక ఆదివాసీ గిరిజన గ్రామాలు తీవ్ర అవస్థలకు గురవుతున్నాయి. వెంటనే తాత్కాలిక మరమ్మతులను చేపట్టాలని కోరుతున్నారు.

వర్షంలో యూరియా కోసం రైతుల పాట్లు



బజార్‌హత్నూర్‌లోని సహకార సంఘం వద్ద వర్షంలో గొడుగులు పట్టుకుని ఉన్న రైతులు

బజార్‌హత్నూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువుల కోసం తెల్లవారుజాము నుంచి సహకార సంఘం ఆవరణలో పడిగాపులు కాస్తున్నారు. కాగా సోమవారం సహకార సంఘం ఎదుట వర్షంలో తడుస్తూ రైతులు యూరియా కోసం తరలి వచ్చారు. ఒక్కో రైతుకి ఐదు బస్తాల చొప్పున యూరియా అందిస్తుండగా.. సోమవారం 888 యూరియా బస్తాలు పంపిణీ చేసినట్లు సిబ్బంది తెలిపారు. పంట ఎదుగుదలకు ఇదే సరైన సమయమంటూ రైతులు వర్షంలో యూరియా కోసం గొడుగులు పట్టుకొని సహకార సంఘం దగ్గర కనిపించారు. అన్ని గ్రామాలకు అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అప్రోచ్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

లోతట్టు ప్రాంతాల ప్రజలు

జర పైలం : ఎమ్మెల్యే బొజ్జు

సిరికొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిర్వాసితులను ప్రభుత్వపరంగా అన్నిరకాలుగా ఆదుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని కొండాపూర్ బ్రిడ్జిని పరిశీలించి, తక్షణమే రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వరదలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి విపత్తు సంభవించిన తనకు, మండల స్థాయి అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట డీఎల్పీవో ఫణిందర్, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ తుకారాం, ఎంపీవో సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: వాతావరణ సూచన ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజారక్షణ కోసం అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్ తో కలిసి పర్యటన చేశారు. ముందుగా మండలంలోని ముత్నూర్ గ్రామంలోని త్రివేణి సంగం ప్రాజెక్టుతో పాటు కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. తర్వాత పిట్టబొంగరం గ్రామంలో ఇంటిపై కప్పు గాలికి కొట్టుకు పోయి నష్టపోయిన ఆనక జంగు కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే దస్నాపూర్, వడ్గాం, హీరాపూర్, అం గ్రామాల్లో పర్యటించారు.



రైతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఎకరానికి రూ.25 వేల పరిహారం చెల్లించాలి : ఎమ్మెల్యే

తలమడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారి వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం వెంటనే ఎకరానికి 25 వేల రూపాయల ఆర్థిక సాయం అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేవరకు అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని అన్నారు. తహసీల్దార్, రాజమోహన్ ఎంపిడిఓ, శంకర్ మండల వ్యవసాయ అధికారి, ప్రమోద్ రెడ్డి ఏఈవో కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

పండగ ఔన్నత్యాన్ని చాటేలా వేడుకలు

● ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి : ఎస్పీ అఖిల్ మహాజన్ ● రెండు బాక్సులకు అనుమతి ఇస్తున్నట్లు వెల్లడి



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



సమావేశానికి హాజరైన గణేష్ మండపాల నిర్వాహకులు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం డీజేలకు అనుమతి లేనందున కేవలం రెండు బాక్సులకు మాత్రమే అనుమతి ఉందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. గణేష్ మండపాలు, విగ్రహ ప్రతిష్ఠపన, బందోబస్తు, సమస్యలపై మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వారి వద్ద నుంచి సూచనలు స్వీకరించి ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉత్సవాలను ఎవరికి ఇబ్బందులు లేకుండా సంతోషంగా జరుపుకోవాలని, నిబంధనలను కూడా పాటించాలని ఎస్పీ అన్నారు. యేటా హైదరాబాద్ తర్వాత ఆదిలాబాద్‌లోనే ఉత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు. వినాయకులు తీసుకువచ్చేప్పుడు డీజేలు, టపాసులకు అనుమతి లేదన్నారు. మండపల నిర్మాణాలు పటిష్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. లేజర్ లైటింగ్ వల్ల గతంలో ప్రమాదాలు జరిగాయని వాటికి కూడా అనుమతి లేదన్నారు. సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం రాత్రి పది గంటలలోపు డీజేలను బంద్ చేయాలన్నారు. కేవలం భక్తి పాటలు మాత్రమే మైక్ సెట్‌లో ఉండాలన్నారు. సూర్యోదయంలోపు విగ్రహాలను నిమజ్జనం చేసేలా చూసుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే యువత తల్వార్‌లు పట్టుకొని ఫొటోలు పెట్టుకోవడం లాంటి చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కాజల్ సింగ్, డీఎస్పీ జీవన్ రెడ్డి, హిందూ సమాజ ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మాండ్లు, మండపాల నిర్వాహకులు రాళ్లబండి మహేందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

● సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్ టౌన్: ప్రజలు అందించే ఫిర్యాదులను పరిష్కరించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇరవై మంది తమ సమస్యలను ఎస్పీకి వివరించగా.. సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు చేశారు. అలాగే ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన వివరాలు ఉన్నా.. సెల్ నెం. 8712659973 ద్వారా సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

గౌడలను ప్రోత్సహించేలా వన మహోత్సవం

● కలెక్టర్ రాజర్షి షా



పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గౌడ కులస్తులను ప్రోత్సహించేలా వనమహోత్సవంలో ఈత చెట్లను పెద్దఎత్తున ప్రభుత్వ స్థలాల్లో ఈజీఎస్ ద్వారా నాటేందుకు ప్రణాళికలు వేసినట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం సర్దార్ పాపన్న గౌడ్ 375వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈసందర్భంగా బస్టాండ్ ఎదుట గల ఆయన విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. అంతకుముందు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలామలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా గౌడ సంఘం అధ్యక్షులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన సేవలకు గాను ప్రభుత్వం ట్యాంక్ బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేస్తోందన్నారు. ఇతర జిల్లాల్లో కాటమరాయ కిట్లను పంపిణీ చేశారన్నారు. జిల్లాలో కావాల్సిన కిట్ల గురించి ప్రభుత్వానికి నివేదికలు అందించడం జరిగిందన్నారు. రాజీవ్ యువ వికాసం కింద రూ.50 వేలు వంద శాతం సబ్సిడీ రుణాలను గౌడ కులస్తులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నర్సరీల్లో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువ ఈత చెట్లను పెంచడం జరిగిందన్నారు. గౌడ కుల వృత్తి కొనసాలంటే ఈత చెట్లు ఉండాలనే నినాదంతో ఈజీఎస్ ద్వారా ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటేల ప్రణాళికలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సర్దార్ పాపన్న గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. అనంతరం పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద పూజలు చేసిన జోగు రామన్న ఘన నివాళులర్పించి మాట్లాడారు.



అర్జిదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

● గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అర్జిదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని ఐటీడీ ఎ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల అర్జీలను స్వీకరిస్తూ వారితో మాట్లాడారు. దీనిలో భాగంగా పింఛన్‌లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా,స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు అధికారి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ జనరల్ దామోదర స్వామి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి’

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంతో పాటు వేధింపులను ఆపాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు సునిత అన్నారు. ఫెస్ క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు హోరెత్తించారు. అంగన్‌వాడీలను బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసేల పీఎంశ్రీ పాఠశాలలను తీసుకువచ్చిందని రాష్ట్ర అధ్యక్షురాలు సునిత అన్నారు. అంగ?డీలో అందించే బోధనను పాఠశాలలో చెప్పడానికి విద్యావాలంటీరల్లను కూడా నియమించిందన్నారు. విద్యావలంటీర్ల వేతనాలను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు అందిస్తే తాము నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. అదే విధంగా ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నందున ప్రైమరీ పాఠశాలకు కేటాయించే నిధులు అంగన్‌వాడీలకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్, యూ నియన్ నాయకురాలు సుజాత, లక్ష్మీ, పార్వతి, విజయ, మధునిక, పెంటుబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం : సీఐ

బోథ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంపత్ నాయక్ తండా, పార్డీ, టివిటి గ్రామాలకు చెందిన యువకులకు రెవెన్యూ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి వారి వద్ద నుంచి రూ. 5,50,000 వసూలు చేసిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సిఐ వెంకటేశ్వరరావు ఎస్ఐ శ్రీసాయిలు తెలిపారు. కరీంనగర్ జిల్లా మంకమ్మ తోటకు చెందిన మామిడాల సతీష్ అనే వ్యక్తి గత ఏడాది ఆయా గ్రామాలలో నిరుద్యోగులను నమ్మించి డబ్బులు వసూలు చేయడం జరిగిందన్నారు. అయితే నష్టపోయిన వారు తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని ఎన్నిసార్లు విన్నవించిన స్పందించకపోవడంతో గత ఏడాది డిసెంబరులో బాధితులు ఫిర్యాదు చేశారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ చేస్తున్నట్లు సీఐ, ఎస్ఐలు ఈ సందర్భంగా తెలిపారు.



నిందితుడితో బోథ్ సీఐ, ఎస్సైలు

సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి : ఐటీడీఏ పీవో
● పలుచోట్ల ముగిసిన తీజ్ ఉత్సవాలు
వివరాలు 7లో...

చిరకాల జ్ఞాపకం.. చిత్రంతో పదిలం
● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అపురూప చిత్రమాలిక
వివరాలు 7లో...

జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాకు ఎంపిక



టీఎంఎల్ మేళాను ప్రారంభించిన మండల విద్యాధికారి

ఉట్నూర్/తలమడుగు/సిరికొండ ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న జిల్లాస్థాయి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శనకు ఉట్నూర్ నుంచి 10 ప్రదర్శనలు ఎంపిక కావడం హర్షణీయమని ఉట్నూర్ మండల విద్యాధికారి రా పెల్లి ఆశన్న అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన టిఎంఎల్ మండల సాయి ప్రదర్శన ప్రారంభించారు. కార్యక్రమంలో పీజీ హెచ్ఎం జాదవ్ రమేష్, ఎంఆర్‌పీ ధరం సింగ్, టీచర్లు రవీందర్ పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో సోమవారం నిర్వహించిన టీఎల్ఎం మేళా విద్యార్థులను ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకట్రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తయారు చేసిన తక్కువ -ధర/ ఖర్చులేని బోధనా అభ్యాస సామగ్రిని ప్రోత్సహించడానికి, ప్రదర్శించడానికి ప్రతిరూపించడానికి ఒక వేదికగా టీఎల్ ఎంను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో సీనియర్ ప్రధానోపాధ్యాయులు ప్రత్యూష ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎల్ఎంతో సులభమైన బోధన

సిరికొండ : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ను మెరుగుపరిచి, వారిలో ఆశించిన ఫలితాలు సాధించేందుకు టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ఉపకరణాలు ఎంతగానో ఉపయోగపడుతాయని మండల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో ఫణిందర్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి టీఎల్ఎం మేళాలో ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుమన్, నరేష్, జ్యోతి, పుండలిక్, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాజీ చౌక్‌లో ఈనెల 8న వృద్ధ యాచకురాలిపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకపోయినా.. పది రోజుల్లోనే కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గుడిహత్నూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన మడావి నగేష్ అలియాస్ నాగోరావ్ గత మూడేళ్ల క్రితం భార్యతో విడిపోయి కూలీ పని చేసుకుంటున్నాడు. ఇదే క్రమంలో మద్యం సేవించి కామంతో మహిళపై అత్యాచారానికి పాల్పడి తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. యాచకురాలి వద్ద రూ.300 తీసుకుని పర్లి వైద్యనాథ్ ట్రైన్ మార్గంలో పారిపోయాడు. పోలీసులు పట్టుకుని విచారణ జరిపారు. కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్, ఏఎస్ఐ ఖైసర్, కానిస్టేబుళ్లు అశోక్, కరీం, రుక్మ రెడ్డి, హనుమంతులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కూలిన ఇళ్ల పరిశీలన

తలమడుగు , ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు మండలంలోని డోర్లీలో గల జలారపు భూదేవి జల్లారపు రమేష్‌ల ఇండ్లు సోమవారం ఉదయం కూలిపోవడంతో వెంటనే గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా వెంటనే స్పందించిన తహసీల్దార్ రాజమోహన్ గ్రామాన్ని సందర్శించి ఇల్లు కూలిపోయిన బాధితులతో మాట్లాడి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

నేరడిగొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన ఆడే కైలాష్ కాలులో రక్తం గట్టకట్టడంతో హైదరాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అతని ఆరోగ్య పరిస్థితుల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, ఫయాజ్, శ్రీకాంత్, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు గొప్ప వరం

నేరడిగొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు గొప్పవరం అని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు.

శివాలయంలో అన్నదానం

తానూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భోసి గ్రామ శివాలయంలో శనివారం భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పెర కృష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామి వారికి అందమైన పూలతో అలంకరించి పంచామృత అభిషేకం చేసి మహాహారతి కార్యక్రమం నిర్వహించారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి రిమాండ్

ఇచ్చోడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షసాక్షిని నేరాన్ని చెప్పకుండా ఉండాలని బెదిరించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఇచ్చోడ సర్కిల్ సీఐ బండారి రాజు అన్నారు. 2023లో జరిగిన మర్డర్ కేసులో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న షేక్ మహమ్మద్ ఆలీ కోర్టులో సాక్ష్యం చేబితే నిందితునికి శిక్ష పడుతుందని తెలుసుకున్న నిందితుడు వనాలే పాండురంగ్ ప్రత్యక్ష సాక్షిని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆలీ ఆదివారం ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందుతుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం

భీంపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలం నిపాని గ్రామానికి చెందిన ఏడిపిల్లి వెంకటి ఇంట్లో సోమవారం వర్షం కారణంగా ఫ్రిజ్, కూలర్, ఇస్త్రీ పెట్టే, బట్టలు దగ్ధయ్యాయి. దాదాపుగా రూ. లక్షన్నర ఆస్తి నష్టం జరిగింది. అలాగే ఇల్లు కూడా చాలా వరకు దగ్ధం అయింది. ప్రస్తుతం ఈ కుటుంబం ఇతరుల ఇంట్లో ఆశ్రయం పొందుతుంది.

శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

బోథ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనూర్ పాఠశాలలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులకు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్ పాల్గొన్నారు. మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను పాఠశాల ప్రిన్సిపల్ సంతోష్ వివరించారు.

అంగన్‌వాడీ టీచర్ల ధర్నా

ఉట్నూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రారంభించిన ఫేస్‌రీడింగ్ సిస్టంను వెంటనే రద్దు చేయాలంటూ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు వర్షం కురుస్తుండగా ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి పి.రత్నమాల, టీఏజీఎస్ ఉట్నూర్ మండల కార్యదర్శి మడావి నాగరావ్, మండల నాయకులు పి.పార్వతి, రసిక, లక్ష్మి పాల్గొన్నారు.

ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధ్యక్షుడి హోదాల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరదలతో నష్టపోయిన రైతాంగానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారని, ప్రస్తుతం వరద బీభత్సంతో నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేల పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు.

తడిసి ముద్దయిన ఆదిలాబాద్ పట్టణం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురిసింది. పట్టణంలోని నాళాలు పొంగిపొర్లాయి. రవీంద్రనగర్, శాంతినగర్, ఖానాపూర్, మహాలక్ష్మివాడ, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్‌తో తదితర కాలనీల్లో వరద చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. రోడ్లపై మోకాళ్ల లోతు నీరు పారాయి. పలుచోట్ల కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. ఆటు స్థానిక షాద్‌నగర్ కాలనీలో సుమారు 20 ఇండ్లల్లో వరద చేరింది. ఇంట్లోని సామాన్‌లు వర్షపు నీటిలో తేలాడాయి. ఎగువన నాలాల నుంచి వర్షపు నీరు ఇంట్లోకి వచ్చి చేరుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉట్నూర్ ఏజెన్సీ లో 60 మిల్లిమీటర్ల వర్షపాతం

ఉట్నూర్ : నాలుగు రోజులుగా ఉట్నూర్ ఏజెన్సీలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉట్నూర్ మండలంలో 27 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ఇంద్రవెల్లి మండలంలో 19.4, నార్నూర్ మండలంలో 30, గాదిగూడ మండలంలో 21.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

తాంసి : మండలంలో సోమవారం మళ్లీ భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మొదలైన ఈ వర్షం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా కుండపోతనే కురుస్తుంది. దీంతో వాగులు, చెరువులు పూర్తిగా నిండిపోయి పరవళ్లు తొక్కాయి. మండలంలోని హసనాపూర్ అంతర్ రాష్ట్ర రహదారిపై పెద్ద ఎత్తున నీళ్లు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

బజార్‌హత్నూర్ : మూడురోజులుగా ఏకధాటిగా కురుస్తున్న అకాల వర్షాలతో మండలంలోని గ్రామాల్లో చెరువులు, వాగులు ఉప్పొంగి పారాయి. ఆ వరద నీటి పరివాహక ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాల్లోని పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులకు తీరని నష్టం మిగిల్చింది.

పిప్పల్‌కోటిని సందర్శించిన డీసీసీబీ చైర్మన్

భీంపూర్ : మండలంలోని పిప్పల్‌కోటిలో సోమవారం ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, తహసీల్దార్ నలంద ప్రియ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రోడ్డ నర్సింలు, నాయకులతో కలిసి సందర్శించారు. నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఎ

తలమడుగు : మండలంలోని సాయి లింగి వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు ఆ వాగు దాటి వెళ్లవలసిన పరిస్థితి రావడంతో తాడు సాయంతో విద్యార్థులను గ్రామస్తులు దాటించారు. రైతులందరికీ ప్రభుత్వం వెంటనే సర్వే చేయించి ఎగరానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించాలన్నారు.

బోథ్ : ఎకరానికి 20 వేల రూపాయల చప్పుడు నష్టపరిహారం అందించాలని బీజేపీ నాయకులు రైల్వే బోర్డు మాజీ సభ్యులు జీవీ రమణ, మండల కన్వీనర్ బోరే రవీందర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సోనాల మండలంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు.

వరదల.. బీభత్సం

(5వ పేజీ తరువాయి...)

వరద ప్రభావానికి 263 గ్రామాల్లో 4086 రైతులకు సంబంధించిన పంటలు నీటి మునిగాయి. దీంతో 11,152 ఎకరాల్లో పంటలు పాక్షికంగా, తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు . మళ్లీ సోమవారం ఎడ తెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి మరో 154 గ్రామాల్లో 3436 మంది రైతులకు సంబంధించిన 8654 ఎకరాల పంటలు నీటమునిగాయి. దీంతో జిల్లాలో మొత్తం పంట నష్టం 19806 ఎకరాలకు చేరింది. ఇందులో అధికంగా 14532 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగింది. అలాగే సోయా 2811, ఎకరాలు కంది 1823, మొక్కజొన్న 625, మిగతా ఎకరాల్లో ఇతర పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించారు. ఆకస్మాత్తుగా వచ్చిన భారీ వరదల కారణంగా పంట పొలాలు కోతకు గురై చాలాచోట్ల ఇసుకమేటలు కనిపిస్తున్నాయి. వరద నీరు పంటలను ముంచెత్తడంతో అధికంగా పత్తి సోయా పంటలు నేలమట్టమయ్యాయి. ఎదుగు దశలో ఉన్న పంటలను వర్షాలు, వరదలు తీవ్రంగా దెబ్బతీయడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోశాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కొట్టుకుపోయిన రోడ్లు... దెబ్బతిన్న కల్వర్టులు

కురుస్తున్న అతి భారీ వర్షాలకు పలు చోట్ల రోడ్లు కొట్టుకుపోయి కల్వర్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దుంచి కొట్టిన వర్షంతో భారీ వరదలు ముంచెత్తాయి. వరదల ఉధృతికి రోడ్లు, కల్వర్టులు కొట్టుకపోయి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 41.32 కిలోమీటర్ల మేర రోడ్లు కోతకు గురై కొట్టుకుపోయాయి. ఇందులో పాక్షికంగా 57 రోడ్లు, 34 కల్వర్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతుల కోసం 3.80 కోట్లు, శాశ్వత మరమ్మతుల కోసం 5.70 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆర్అండ్ బీ పరిధిలో 62 కిలోమీటర్ల మేర రోడ్లు కోతకు గురయ్యాయి. 24 కల్వ ర్టులు దెబ్బతిన్నాయి. ఇందు కోసంగాను రు.3.15 కోట్ల నిధులు అవసరమని ఆ శాఖ అధికారులు గుర్తించారు. అదిలాబాద్ మున్సిపాలిటి పరిధిలో వరదల ప్రభావానికి 13 వార్డుల్లో 13.65 కిలోమీటర్ల మేర కంకర మట్టి, తారు రోడ్లు దెబ్బతిన్నాయి. దీనికి కోటి 76 లక్షల నిధులు అవసరమని అంచన వేస్తున్నారు. 12 కల్వర్టు లు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతుల కోసం 96 లక్షల నిధులు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే 1218 సర్వీసులు దెబ్బ తినడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బంగారు గూడా కాలనీలో 42 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించి సహాయక చర్యలను అందిస్తున్నారు.

తగ్గని వరద ఉధృతి

జిల్లా మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్ గంగా నదికి ఇంకా వరద ఉధృతి కొనసాగుతుంది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరదలు వస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు..కోర్ట చనక బ్యారేజి వద్ద 7 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళ్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పెన్ గంగా నది బ్యాక్ వాటర్ తో భీంపూర్ జైనథ్ , బేల మండలాల్లోని పలు గ్రామాల్లో పంటచేన్‌లు ఇంకా వరదనీటిలోనే కనిపిస్తున్నాయి. వేల ఎకరాలకు పెన్ గంగా నది వరదలు ముంచెత్తినట్లు రైతులు చెబుతున్నారు. సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టుల గేట్లను ఒకేసారి ఎత్తడంతో పాటు మహారాష్ట్ర నుంచి వస్తున్న వరద ఉధృతితో పంటలు నీట మునుగుతున్నాయి. నది పరివాహక ప్రాంతంలోకి ఎవరు వెళ్లవద్దంటూ అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు.

నేడు జిల్లాలో పర్యటించనున్న ఇన్‌చార్జి మంత్రి

అతి భారీ వర్షాలు వరదల కారణంగా రోడ్లు పంటలు తీవ్రంగా దెబ్బ తినడంతో పాటు ఆదిలాబాద్ పట్టణంలో పలు కాలనీలను వరద నీరు ముంచెత్తడంతో జిల్లా కలెక్టర్ రాజా ర్షీ షా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లతో పాటు బోథ్ , ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల శంకర్ గత రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా జిల్లాలోని పరిస్థితులను ఆరా తీశారు. వెంటనే సహాయక చర్యలు అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల, నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి పర్యటించనున్నారు. ప్రధానంగా వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు రోడ్లు ఇండ్లను పరిశీలించి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారు. అనంతరం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బయలదేరి వెళ్తారు.

విద్యుత్ శాఖకు రూ.13.34 లక్షల నష్టం

భారీ వర్షాలు వరదల కారణంగా జిల్లాలో విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. మొత్తం 13.34 లక్షల నష్టం జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో 11 కేవీ స్తంభాలు 36 నేలకొరుగగా రూ.6.12 లక్షల నష్టం, ఎల్‌టీ లైన్‌లో 33 స్తంభాలు పడిపోయి 3.63 లక్షలు, డీటీఆర్ఎస్ లైన్‌లో 2 స్తంభాలు కూలి 1.16 లక్షల నష్టం వాటిల్లిందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ప్రధానంగా తాంసి, నేరడిగొండ, బోథ్, ఆదిలాబాద్ రూరల్, ఇచ్చోడ, తలమడుగు, గాదిగూడ, సిరికొండ, ఇంద్రవెల్లి మండలాల పరిధిలో ఎక్కువ నష్టం వాటిలినట్లు అధికారులు పేర్కొంటున్నారు. వెంటనే విద్యుత్తును పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు.

విధుల నిర్వహణతోనే గుర్తింపు

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



అభినందిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే

భైంసా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ,ఉపాధ్యాయులకు విధుల నిర్వాహణతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉద్యోగ, ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన పలువురిని సన్మానించి అభినందించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ,ఉపాధ్యాయులు వృత్తిలో నిబద్ధతతో వ్యవహరిస్తూ , అంకితభావతంతో బాధ్యతలు నిర్వర్తిస్తూ పారదర్శకమైన రీతిలో ఆదర్శంగా నడుచుకుంటే సమాజంలో గౌరవ,మర్యాదలు చేకూరుతాయన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉద్యోగులు,ఉపాధ్యాయులుగా అవార్డులు, ప్రశంసా పత్రాలు పొందిన వారందరికి అభినందనలు తెలిపారు. ఇందులో బీజేపీ ప్రతినిధులు సాంప్లీ రమేష్, చంద్రకాంత్ పాటిల్, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఏరువాక కేంద్రం కొనసాగించాలి

ముథోల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోనే డీఏటీటీసీ ఏరువాక కేంద్రం కొనసాగించాలని మండల బీజేపీ నాయకులు టి. రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 15-06-2020లో ముథోల్‌కు మార్చిన తర్వాత ఇక్కడి నియోజకవర్గం రైతులకు ఎనలేని సేవలందించిందన్నారు. యువతకు ఉపాధి కూడా లబించిందని, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉండి సేవలను అందించాలన్నారు.

పాఠశాల పరిశీలన

కుంటాల, ఆగస్టు, 18 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో ఆదర్శ మోడల్ పాఠశాలను సోమవారం మోడల్ స్కూల్ జేడీ దుర్గా ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను ఆయన పరిశీలించారు. అనంతరం తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ప్రిన్సిపల్‌లు శ్రీనివాస్ ప్రసాద్, రాజు, సిబ్బంది నవీన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

జాతీయ స్థాయి కార్యశాలకు ఉపాధ్యాయుడు ఎల్లన్న

భైంసారూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఎం.ఎల్లన్న జాతీయ స్థాయి కార్యశాలకు ఎంపిక అయ్యారు. జాతీయ స్థాయి వేదికపై ప్రతిభకు అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని ఎం. ఎల్లన్న అన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులు, మండల విద్యాధికారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సహోపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

అంగన్‌వాడీల ధర్నా

నిర్మల్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ ఏవోకు వినతి పత్రం ఇచ్చినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి. లలిత తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శైజల, జిల్లా ఉపాధ్యక్షురాలు రజియా, బి. ప్రసాద, రమయ్య, భాగ్య, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తానూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావుపటేల్ అన్నారు. సోమవారం మండలంలోని నందిగాం, సింగన్‌గావ్‌తో పాటు పలు గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మౌళాఖాన్, దహగాం మాజీ సర్పంచ్ సాయినాథ్, నాయకులు ఫుర్ఖాన్, కార్యకర్తలు, తదితరులున్నారు.

వదలని ముసురు

కుంటాల, ఆగస్టు, 18 : (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం రోజంతా ముసురు కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా ముసురు కురియడంతో ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు వెళ్లలేకపోయారు. అక్కడక్కడ రోడ్లు జలమయమయ్యాయి.

స్ఫూర్తిదాయకం సర్వాయి పాపన్న చరిత్ర



భైంసాలో సర్వాయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

భైంసా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాలకు నాంది పలికిన వీరయోధుడు సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిదాయక మహోన్నత మూర్తిగా స్వాతంత్ర్య సంగ్రామంలో త్యాగాలతో కూడిన సేవలందించారని హిందు ఉత్సవ సమితి భైంసా అధ్యక్షులు పెండెపు కాశీనాథ్ పేర్కొన్నారు. సోమవారం భైంసాలోని గురుకృపా ఓకేషనల్ కళాశాలలో జరిగిన సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. గురుకృపా ఓకేషనల్ ఆధ్యాపక బృందం, విద్యార్థులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాల ద్వారా హక్కులు సాధించుకోవాలి

నిర్మల్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మోకుదెబ్బ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు గల పాపన్న విగ్రహంకు సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వారోత్సవాలను నిర్వహించినట్లు రాష్ట్ర కన్వీనర్ అమరవేణి నర్సాగౌడ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు జయంతి వారోత్సవాల నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అమరవేణి నర్సాగౌడ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శిం ఎంసీ లింగన్న, నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు పడాల రాజేందర్ గౌడ్, తీగల వెంకట్ గౌడ్, దమ్మగోని రమణ గౌడ్, బాలా గౌడ్, యాగండ్ల దశ గౌడ్, జిల్లా అధ్యక్షులు పి. గోపి గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పాకాల చంద్రశేఖర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కడెం : కడెం మండల కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం దగ్గర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... మొఘలులు, రజాకార్ల ఆధిపత్యాన్ని ఎదిరించి బహుజనుల రాజ్యాధికారం కోసం తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు.

ఖానాపూర్ : పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ... ఆయన పోరాట పటిమను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ల రాజేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు చిన్న నర్సాగౌడ్, దుర్గం వెంక గౌడ్ తదితరులున్నారు.

విగ్రహ ధ్వంసంపై నిరసన



బస్టాండ్ ఎదుట ప్రదర్శనలు నిర్వహిస్తున్న నిరసనకారులు

భైంసా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలోని తానూర్ మండలం బోసి గ్రామంలో చోటు చేసుకున్న చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంస ఘటనను వ్యతిరేకిస్తూ సోమవారం భైంసాలో నిరసనలు హోరెత్తాయి. బోసి గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనల్లో బీజేపీ, బీఎస్పీ, జనసేన ,రజక సంఘం, ఎంఆర్పీఎస్ శ్రేణులు,దళిత సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నాయి. ఘటనకు పాల్పడిన వారిని వెంటనే పట్టుకొని అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం బస్టాండ్ నుంచి ర్యాలీగా నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. అక్కడ సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అక్కడి నుంచి సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయానికి వెళ్లి ఏఎస్పీ అవినాష్ కుమార్‌లకు వినతి పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకెట పోశెట్టి, బీజేపీ రాష్ట్ర ప్రతినిధి బోస్లే బాజీరావ్ పాటిల్, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ప్రతినిధి సుంకెట మహేష్ బాబు, బీఎస్పీ జిల్లా ప్రతినిధి దేవిదాస్ హస్నే, దళిత సంఘాల ప్రతినిధి యశ్వంత్ బన్సోడే, ఎంఆర్‌పీఎస్ ప్రతినిధి గోరేకర్ శంకర్‌లు మాట్లాడారు.


నరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

దిలావర్‌పూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని సోమవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ ఏ. మహేందర్ ఎమ్మెల్యేకు శాలువాతో సత్కరించారు. అనంతరం గోశాల నిర్వహణ, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు నర్సయ్య, విఠల్, బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, మాజీ జడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, చందు, జమాల్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కబడ్డీ యువ సిరీస్‌కు రవి



లక్‌పతివార్ రవి

తానూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ కబడ్డి యువ సిరీస్‌కు మండలంలోని ఝరి(బి) గ్రామ యువకుడు లక్‌పతివార్ రవి ఎంపికయ్యాడు. ఈ నెల 27వ తేది నుండి హైదరాబాదులో జరిగే తెలంగాణ యువకబడ్డి సిరీస్‌కి జోగులంబ లయన్స్‌లో ఎంపికయ్యాడు. 27వ తేదిన జట్టు తరుపున హైదరాబాద్‌లో జరిగే ఈ పోటీల్లో ఆడనున్నాడు. దీంతో రవికి గ్రామస్తులు, మండల వాసులు అభినందనలు తెలుపుతున్నారు.

ముద్గల్‌లో ఉచిత పశువైద్య శిబిరం

ముథోల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్గల్ గ్రామంలో సోమవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి డా. రాజేశ్వర్ రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు పశువులకు టీకాలు వేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

కుంటాల, ఆగస్టు, 18 : (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నుంచి వర్షాలు నిరవధికంగా కురుస్తుండడంతో దోమలు వ్యాపించి గ్రామాలలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గ్రామస్థాయి సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో సుదర్శన్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కుంటాలలో ఆయన పర్యటించి మురికి కాలువలను, గ్రామంలోని వీధులను పరిశీలించారు. మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ మురికి కాలువల్లో తీసిన చెత్తను ట్రాక్టర్ ద్వారా ఎప్పటికప్పుడు చెత్త సేకరణ షెడ్డుకు తరలించాలని సూచించారు. జనవాసాల మధ్య నీరు నిల్వకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని సూచించారు. ఈయన వెంట ఎంపీవో రహీం, పంచాయతీ సెక్రటరీ రాజబాబు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం

కుంటాల, ఆగస్టు, 18 : (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం దృష్ట్యా విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా సోమవారం కుంటాల హైస్కూల్‌లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్యాధికారిణి శృతి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో సుదర్శన్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రహీం, పంచాయతీ కార్యదర్శి రాజబాబుతో పాటు పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సారంగాపూర్ : మండలంలోని జావులి ఆలూరు గ్రామాలలో సోమవారం సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించి 86 మంది వ్యాధి గ్రాస్తులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులంను అందజేశారు. 15 మంది వ్యాధి గ్రాస్తులకు జ్వర పరీక్షలు చేసి రక్తపూతలు సేకరించారు. ఈ వైద్య శిబిరాల్లో వైద్య సిబ్బంది పద్మ, అనసూయ, గంగ, నుస్రత్, రాజేందర్, కిరణ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు అందుకున్న అధికారులకు ఘన సన్మానం

ముథోల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ఉత్తమ అవార్డు అందుకున్న తహసీల్దార్ శ్రీలతకు, ఎస్సై బిట్ల పెర్సెస్‌కు, పంచాయతీ ఈవో అన్వర్‌లకు సోమవారం ఉత్సవ సమితి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోళ్ల రమేష్, అనిల్, కోరి పోతన్న, సుభాష్, సుదర్శన్, నారాయణ, టి. రమేష్, మోహన్ యాదవ్, జీవన్, లవన్ కుమార్, సాయి ప్రసాద్, శ్రీనివాస్, సాయినాథ్, తదితరులున్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ఖానాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో గల నిరుపేద దంపతులు అనుమల్ల రాధా మల్లేశం కుటుంబానికి ఓకేఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. సోమవారం ఓకేఆర్ ఫౌండేషన్ బృందం డబుల్ బెడ్ రూమ్ కాలనీలోని మల్లేశం ఇంటికి వెళ్లి 50 కిలోల బియ్యం, పప్పులు, వంట నూనె సహా నిత్యావసర సరుకులను అందజేశారు. కొద్ది రోజులలో రాధా మల్లేశం దంపతుల కుమార్తె పావని వివాహం ఉన్నందున ఆ కుటుంబం ఓకేఆర్ ఫౌండేషన్‌ను సహాయం కోసం సంప్రదించడంతో వారికి ఈ సహాయాన్ని అందజేసినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.



మల్లన్న దర్శనానికి భారీ వర్షంలో గొడుగుల సహాయంతో పాదయాత్రగా వస్తున్న దరంపూరి గ్రామస్థులు

మల్లికార్జునుడికి ముక్కోటి మొక్కులు

● సిరిచెల్మకు పోటెత్తిన భక్తులు

ఇచ్చోడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలోని ప్రసిద్ధ ప్రాచీన మల్లికార్జున ఆలయానికి భక్తులు పెద్దఎత్తున రావడంతో ఆ ప్రాంతమంతా శివనామస్మరణతో మార్మోగింది. మండలంలోని దరంపూరి, మాన్కాపూర్, తలమద్రి, మల్యాల తదితర గ్రామాల భక్తులు పెద్దఎత్తున్న తమ గ్రామాల నుంచి కాలినడకన ర్యాలీగా ఓం నమఃశివాయ అంటూ నినాదిస్తూ ఆలయానికి చెరుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే మల్లన్నకు తమ ఇంటి నుంచి నడుచుకుంటూ వచ్చి మొక్కులు చెల్లించుకుని అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ఆ పరమశివుడిని దర్శనం చేసుకున్నారు. ఎడితెరపి లేకుండా కురుస్తున్న వర్షంలో సైతం గొడుగు సహాయంతో ఆలయానికి చెరుకొని మల్లన్నను దర్శించుకున్నారు. దీంతో ఉదయం నుంచి భక్తులతో మల్లికార్జుల ఆలయం కిటకిటలాడింది.

నవరాత్రులను.. ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

● నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల



నిర్మల్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రులను దృష్టిలో పెట్టుకుని నిర్మల్ జిల్లా పరిధిలో గణేష్ మండపాలు సజావుగా, శాంతియుతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ తరపున ఎస్పీ మండపాల నిర్వాహకులకు సోమవారం పలు సూచనలు జారీ చేశారు. దీనిలో భాగంగా ప్రతీ గణేష్ మండప నిర్వాహకులు పోలీసు అనుమతి కోసం తప్పనిసరిగా అప్లై చేసుకోవాలని తెలిపారు. గణేష్ ప్రతిమ ఎత్తు, మండపం ప్రదేశం, నిమజ్జనం తేదీ, నిమజ్జనం ప్రదేశం వంటి వివరాలతో తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు ఆన్‌లైన్‌లో అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. అనుమతి పత్రం, క్యూఆర్ కోడ్, పోలీస్ సూచనలు మండపం వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలి అని ఎస్పీ పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యుత్ కనెక్షన్ విద్యుత్ శాఖ అనుమతితో మాత్రమే తీసుకోవాలి. నాణ్యత గల వైర్లు వాడి షార్ట్ సర్క్యూట్‌కి అవకాశం లేకుండా చూడాలి. మండపం వద్ద ప్లెక్సీలలో కమిటీ సభ్యుల పేర్లు, బాధ్యత వహించే వారి ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉంచాలి. నిమజ్జన సమయంలో ప్రతీ ప్రతిమకు కనీసం ఐదుగురు బాధ్యత వహించే సభ్యులు ఉండాలి. శబ్ద కాలుష్యం నివారణలో భాగంగా కేవలం రెండు స్పీకర్లు మాత్రమే ఉపయోగించాలి. వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా శబ్ద పరికరాలు పరిమితంగా వాడాలి. మండపంలో ప్రతీరోజు 24 గంటలు ఒక వలంటీర్ తప్పనిసరిగా ఉండాలి. అగ్ని ప్రమాద నివారణ చర్యగా నీటి బకెట్లు, ఇసుక బస్తాలు తప్పనిసరిగా ఉంచాలి అని పేర్కొన్నారు. అలాగే, మండపాల వద్ద మద్యం తాగడం, పేకాట ఆడటం, లక్కీ డ్రాలు, అసభ్యకర నృత్యాలు, ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు, పాటలు పూర్తిగా నిషేధం. మండపం వద్ద పోలీస్ తనిఖీల కోసం పాయింట్ పుస్తకం తప్పనిసరిగా ఉంచాలి అని స్పష్టం చేశారు. అదేవిధంగా అనుమానాస్పద బ్యాగులు, సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనబడితే వెంటనే డయల్ 100, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. జిల్లా పోలీస్ శాఖ తరపున అన్ని గణేష్ మండప నిర్వాహకులు సూచనలు పాటించి, గణేష్ నవరాత్రులు వాంతియుతంగా జరగడానికి సహకరించాలని నిర్మల్ ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఘనంగా సాయిబాబా పల్లకి ఊరేగింపు

తాంసి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం సాయిబాబా పల్లకీ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. విద్యానగర్ కాలనీకి చెందిన భక్తులు సాయిబాబా ఆలయం నుంచి పల్లకిలో సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో మహిళల మంగళ హారతుల మధ్య వీధుల్లో తిరుగుతూ భక్తిగీతాలు ఆలపించారు. పల్లకి తీసుకువచ్చిన భక్తులకు గ్రామస్థులు బియ్యం, పప్పులతో పాటు దక్షిణ సమర్పించారు. అనంతరం సాయిబాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాళ్ల అశోక్ రెడ్డి, మంత్రి నర్సారెడ్డి, ఉపేందర్, సంతోష్, కాళ్ల అనిల్ కుమార్, భూమన్న, దేవమ్మ, తదితరులున్నారు.



ఇచ్చోడలో గర్భిణులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

గర్భిణులకు మెరుగైన సేవలందించాలి

● డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఇచ్చోడ, ఆగస్టు, 18(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులకు మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ వైద్యసిబ్బందికి సూచించారు. సోమవారం ఇచ్చోడ పీహెచ్‌సీని సందర్శించి గర్భిణులకు అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎడితెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పీహెచ్‌సీ ఆవరణ మొత్తం వరదనీటితో నిండుతొందని, డెలివరి కోసం వచ్చే గర్భిణులకు పక్కనున్న పీహెచ్‌సీకి తరలించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం జాగ్రత్త వహించాలన్నారు. వైద్యులు కిరణ్‌కుమార్, మధురిమ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సద్దాం అన్నారు. సోమవారం మండలంలోని కోరిటికల్, వెంకటాపూర్ గ్రామాలలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా రోగులకు సిబ్బంది వైద్య చికిత్సలు అందించారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలన్నారు. ఎప్పటికప్పుడు వేడివేడి ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనారోగ్యాల బారిన పడితే వెంటనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పి వాణి, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, పంచాయతీ సెక్రెటరీ జ్యోతి, ఆశా గంగామణి, శాంకి, తదితరులు ఉన్నారు.

కదిలిన భక్తజనం

● శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో మహిళల విశేష పూజలు
● మొక్కులు చెల్లించుకున్న భక్తజనం
● జనసంద్రమైన కదలిలోని పాపన్న లొద్ది



కదిలిలో వటవృక్షం వద్ద భక్తుల పూజలు



కదిలిలో ధ్యాన మందిరంలో దర్శించుకుంటూ..

దిలావర్‌పూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం కదిలి పాపహరేశ్వర స్వామి కొలువైన పాపన్నలొద్ది సోమవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో జనసంద్రంగా మారింది. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో తమ ఇష్టదైవమైన పాపహరేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు బోరున కురుస్తున్న వర్షాన్ని లెక్క చేయకుండా బారులు తీరారు. గోముఖ గుండంలో పవిత్ర స్నానాలు చేసిన భక్తులు అన్నపూర్ణేశ్వరి సమేత పాపహరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. 18 వృక్షాలతో కూడిన మహా వట వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

ఋషి గుండంలో పవిత్ర జలాలు

ఋషి గుండంలోని పవిత్ర జలాలను ఇళ్లల్లో, పంటలపై చల్లేందుకు వెంట తీసుకెళ్లారు. స్వామివారి సన్నిధిలోనే కొలువైన నాగదేవతకు కొబ్బరి కాయలు కొట్టి పిల్లా పాపలను, పశు పక్షాదులను చల్లంగా చూడాలని మొక్కుకున్నారు. కోటి దీపార్చన పూజలు చేశారు. మాత అన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకుని కుంకుమార్చన పూజలు చేశారు. పాపహరేశ్వర స్వామి దర్శనం కోసం 'కదిలి' వచ్చిన భక్తులకు ముథోల్ నియోజకవర్గంలోని భైంసా మండలం అంబుగామ్ గ్రామానికి చెందిన సుదర్శన్ పటేల్ దంపతులు అన్నదానం చేశారు. దిలావర్‌పూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించగా, కదిలి పాపహరేశ్వర స్వామి సేవాదళ్ వాలంటీర్లు భక్తులకు సేవలందించారు. దేవస్థానం తాజా మాజీ చైర్మన్ నార్వాడి వెంకట్ రావు పాటిల్, పాలక వర్గ సభ్యులు రమేష్, రవి, మాజీ చైర్మన్ భుజంగ్ రావు పటేల్, మాజీ సర్పంచ్‌లు భూమేష్, మారుతి పటేల్, తదితరులు భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ చేశారు. సోమవారం దాదాపు 25 వేల మంది భక్తులు వచ్చినట్లు అంచనా వేశారు.



కదిలి పాపహరేశ్వర స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



నిర్మల్ నుంచి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో భక్తుల పాదయాత్ర

● నిర్మల్ శ్రీఉమా మహేశ్వర ఆలయం నుంచి కదిలి వరకు..



పూజలు చేస్తున్న సమితి అధ్యక్షుడు లక్కడి

నిర్మల్ టౌన్: శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకొని నిర్మల్ జిల్లా కేంద్రంలోని నటరాజ్ నగర్ శ్రీ ఉమా మహేశ్వర ఆలయం నుండి దిలావర్‌పూర్ మండలం కదిలి గ్రామంలోని శ్రీ మాతాన్నపూర్ణ పాపహరేశ్వర ఆలయం వరకు సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. లోక కళ్యాణార్థం 9వసారి పాదయాత్ర చేస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వర్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య, అంజు కుమార్ రెడ్డి, మెడిసెమ్మె రాజు, భక్తులు పాల్గొన్నారు.

సంస్కృతిని భావితరాలకు అందించాలి

● ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



ఉట్నూర్‌లో తీజ్ గంపను ఎత్తుకున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజనులు తమ ఆచార సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా కాపాడుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన తీజ్ ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తీజ్ గంపను ఎత్తుకొని విద్యార్థులతో కలిసి వేడుక నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె బంజారాల కుల దేవత జగదాంబ దేవి, కుల గురువు శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్, శ్రీరామారావు మహరాజ్ చిత్రపటాలకు భోగ్ బండారు నిర్వహించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పీవో తీజ్ బోనం ఎత్తుకున్నారు. గ్రామపెద్దలకు గోధుమ మొలకలు ఇచ్చి ఒకరినొకరు గౌరవించుకున్నారు. పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తూ పాటలు పాడారు. బోనంను చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మానిక్ రావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీ వేణి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ముగిసిన తీజ్ ఉత్సవాలు

నేరడిగొండ: బంజారాల ప్రధాన పండుగల్లో ఒకటైన తీజ్ ఉత్సవాలు కేజీబీవీలో ఘనంగా ముగిశాయి. సంప్రదాయ గీతాలు, నృత్యాలతో చిన్నారులు, యువతులు, మహిళలు తీజ్ (గోధుమ మొలకల) బుట్టలతో నృత్యం చేశారు. బంజారా తీజ్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినిలతో కలిసి తీజ్ తెంపి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినిలతో కలిసి సంప్రదాయ పాటలపై ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శివారెడ్డి, దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, జాదవ్ మహేందర్, సాబ్లే ప్రతాప్, తదితరులు ఉన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో బంజారాలు ముఖ్యంగా జరుపుకునే తీజ్ పండుగ ముగింపు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవాలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పర్యవేక్షణలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొని ఉత్సాహంగా జరుపుకున్నారు.



నేరడిగొండ కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్



ముత్నూర్‌లోని గిరిజన సంక్షేమ కళాశాలలో పూజలు చేస్తున్న విద్యార్థినులు



బురదమయంగా మారిన అడెల్లి రోడ్డు

అవస్థల అడెల్లి రోడ్డు

● ఘాట్ రోడ్డుపై భయం.. భయం

బోథ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని కుచలాపూర్ దన్నూర్‌ల మీదుగా గత ఏడాది నిర్మించిన అడెల్లి రోడ్డు అధ్వాన్నంగా మారింది. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని అడెల్లి మీదుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఈ రోడ్డు వర్షాకాలం బురదమయంగా మారడంతో అడెల్లి పోచమ్మ దర్శనానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని భక్తులు అంటున్నారు. రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల దూర భారం తగ్గింది అనుకుంటే వర్షాకాలంలో మాత్రం ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే అవస్థలు తప్పడం లేదని ప్రయాణికులు అంటున్నారు. కేవలం అర కిలోమీటర్ మేరకు రోడ్డు పనులు నిలిచిపోవడంతో దేవాలయానికి వెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారు రోడ్డు పరిస్థితి తెలియక ఈ రూట్లో వెళ్లి వెనుదిరిగి రావాల్సి వస్తుంది. బురద ఉన్నచోట తాత్కాలికంగా అయినా మొరం పోయించితే వాహనాలు నడిచే వీలుందని పలువురు పేర్కొంటున్నారు. జిల్లా అధికారులు రోడ్డుపైన ప్రయాణం సాగేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

సమష్టి కృషితోనే విజయ సాధ్యం

● పొలాల పండుగ నిర్వహణపై ప్రత్యేక సమావేశం

తాంసి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పొలాల పండుగ నిర్వహణ సమష్టిగా కృషి చేస్తేనే పూర్తిస్థాయిలో విజయవంతం అవుతుందని ప్రముఖ నిర్మాత, హోమియోపతి వైద్య నిపుణుడు, సాయి వైకుంఠ ట్రస్ట్ అధిపతి డాక్టర్ రవి కిరణ్ యాదవ్ అన్నారు. ఈనెల 23న నిర్వహించే పొలాల పండుగ నిర్వహణపై సోమవారం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామస్తులతో స్థానిక రామేశ్వర ఆలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పొలాల పండుగ ఏర్పాట్లలో తీసుకోవలసిన చర్యల గురించి వివరాలు సేకరించారు. రాష్ట్రంలోనే తాంసికి ప్రత్యేక గుర్తింపు రావడం కోసం ప్రతీఒక్కరు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. యువత కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలని కోరారు.



పొలాల అమావాస్య నిర్వహణపై మాట్లాడుతున్న డాక్టర్ రవికిరణ్

జాతీయస్థాయి కరాటే పోటీల్లో బ్లాక్ బెల్ట్



జాతీయస్థాయి అవార్డును అందుకుంటున్న సురేష్

బోథ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబేరా గ్రామానికి చెందిన సదుమకి సురేష్ అనే యువకుడు జాతీయ స్థాయిలో నిర్వహించిన కరాటే బెల్ట్ టెస్ట్ పోటీలలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. ఈ నెల 17న కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బ్లాక్ బెల్ట్ 4 డన్ సాధించాడు. ఈ సందర్భంగా ఆయనను తెలంగాణ రాష్ట్ర కె.సీ.భూకై. రాష్ట్ర సెక్రెటరీ కరాటే మాస్టర్ విజ్జి గిరి రవిలు అభినందించారు. అంతేగాక బ్లాక్ బెల్ట్ సాధించిన యువకుడిని ఇండియా కె న్ని. భూ. హాయ్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ రాష్ట్ర అధ్యక్షులు కే రమేష్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందించారు. మారుమూల గ్రామం నుండి గిరిజన యువకుడు బ్లాక్ బెల్ట్ సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తపరిచారు.

చిరకాల జ్ఞాపకం.. చిత్రంతో పదిలం

● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అపురూప చిత్రమాలిక





అనాటి గిరిజన కళను ప్రతిబింబిస్తున్న చిత్రాలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఏళ్ల నాటి జ్ఞాపకాలు పదిలంగా ఉండడంలో ఫొటోగ్రఫీ పాత్ర కీలకం. ఆనాటి మధుర స్మృతులను మరోసారి గుర్తు చేసుకోడానికి, చెక్కు చెదరని జ్ఞాపకాలను మననం చేసుకోడానికి ఎంతగానో దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం సెల్‌ఫోన్‌ల రాకతో ప్రతిఒక్కరూ ఫొటోగ్రఫీలో నిష్ణాతులయ్యారు. అయితే కొన్నేళ్ల క్రితం మాత్రం ఇటువంటి పరిస్థితి లేదు. చిన్నపాటి శుభకార్యాలను మొదలుకుని రాజకీయ నేతల పర్యటనలు, సభల వరకు ఫొటోగ్రాఫర్ ఉండాల్సిందే. ఫొటోగ్రఫీ విభాగంలో కొత్త సాంకేతికత అప్పుడప్పుడే అందుబాటులోకి వస్తున్న తరుణంలోనే జిల్లాకు చెందిన పలువురు ఫొటోగ్రాఫర్‌లు ఆ రంగంలో విశేషంగా రాణించి తమదైన గుర్తింపు పొందారు. పట్టణానికి చెందిన ఆహుజ ఫొటోగ్రాఫర్ అందులో ఒకరు. 1970 కాలం నుంచి ఆయన ఫొటోగ్రఫీలో అద్భుతంగా రాణిస్తున్నారు. జిల్లాలో షైమన్ డార్ఫ్ పర్యటన, భూ సంస్కరణలపై అవగాహన, దేశ మాజీ ప్రధాని వాజపేయి పర్యటన నాటి ఫొటోలు ఇప్పటికీ ఆయన వద్ద పదిలంగా ఉన్నాయి. తీరిక దొరికినప్పుడల్లా వాటిని చూస్తూ ఆనాటి జ్ఞాపకాలోకి వెళ్తుంటారు. ఇప్పటికీ స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరై తనదైన శైలిలో చిత్రాలు తీస్తూ ఆహూతులను మెప్పిస్తుంటారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆయన తీసిన చిత్రాలు.. ఆనాటి రోజులను గుర్తుకు తెస్తాయనడంలో సందేహమే లేదు.



వాజ్‌పాయి పర్యటన నాటి ఫొటోలు



జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్న ఫొటోగ్రాఫర్ ఆహుజ

జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు.. అందులోనూ రాణించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని బేస్ బాల్ సంఘం జిల్లా అధ్యక్షులు కలాల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. దాదాపు ఏడు వందల మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పురుషుల విభాగంలో హైదరాబాద్, రంగారెడ్డి జాయింట్ విన్నర్‌లుగా, నిజామాబాద్ తృతీయ స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో హైదరాబాద్, నిజామాబాద్ జాయింట్ విన్నర్‌లుగా, నల్గొండ తృతీయ స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమంలో అతిథులు ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఇందులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్వేత, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి, కృష్ణ, లోక ప్రవీణ్ రెడ్డి, డీవైఎస్ఒ జక్కుల శ్రీనివాస్, జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు చిక్కాల దత్తు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

నిర్మల్‌రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు ముఖ్యకార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయోనని, ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి ఫిర్యాదుపైన సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీచేసి ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.


పెంబి కొసగుట్ట మార్గంలో నీట మునిగిన రోడ్డు


ఖానాపూర్‌లో డప్పు చాటింపు


పొంగి పొర్లుతున్న కడెం వాగు


నీట మునిగిన పత్తి పంట


స్వర్ణ ప్రాజెక్టు రెండుగేట్లు ఎత్తి నీరు దిగువ ప్రాంతానికి వదిలిన అధికారులు

ఎడతెగని వర్షం.. భారీ నష్టం

- మూడు ప్రాజెక్టుల్లోకి పెరిగిన వరద ఉధృతి
- గేట్లు పైకెత్తి దిగువకు నీటి విడుదల
- ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో ఉప్పొంగుతున్న గోదావరి
- జిల్లా అంతటా పొంగి పొర్లుతున్న వాగులు

నిర్మల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఇటు పంటలకే కాకుండా ఆర్అండ్‌బీ పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని రోడ్లు, వంతెనలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. దీంతో పాటు ఇరిగేషన్ శాఖ పరిధిలోని పలు చెరువుల కట్టలు అలాగే కాలువలు దెబ్బతిన్నాయి. దీంతో సంబంధిత శాఖల అధికారులు నష్టం అంచనాలను రూపొందించారు. ఈ లెక్కన ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో 61 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతినగా నాలుగువంతెనలకు నష్టం జరిగింది. దీంతో అధికారులు దాదాపు రూ.45 లక్షల రూపాయలతో మరమతుల కోసం ప్రతిపాదనలు పంపించారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో మొత్తం 17 సీడీ వర్క్‌తో పాటు 26 కిలో మీటర్ల మేర రోడ్లు దెబ్బతినగా అధికారులు మరమతుల కోసం రూ.27 లక్షల రూపాయలు అవసరమవుతాయంటూ ప్రతిపాదనలు రూపొందించారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో మొత్తం ఐదు ట్యాంక్‌బండ్‌లు, ఐదుచోట్ల కెనాల్‌లు దెబ్బతిన్నాయి. నష్టం విలువ రూ.5 కోట్ల వరకు ఉంటుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సగటు వర్షపాతం 16.8 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఇదిలా ఉండగా జిల్లాలోని కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులకు ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తున్న కారణంగా ఎప్పటికప్పుడు ఆ ప్రాజెక్టుల గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ నుంచి దిగువకు భారీగా నీరును విడుదల చేస్తున్న కారణంగా జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాలకు ముంపు ముప్పు ఏర్పడుతోంది.

పొంగి పొర్లుతున్న వాగులు...

జిల్లాలోని కడెం, పెంబి మండలాల్లో గల పలు వాగులు పొంగి పొర్లుతుండడంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా పెంబి మండలంలోని 20 గ్రామాలు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న కారణంగా రాకపోకలు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ 20 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలన్ని తెగిపోయాయంటున్నారు. కడెం వాగు, పలికేరి, దొత్తి వాగులు పొంగుతుండడంతో వారం రోజుల పాటు ఈ మారుమూల గ్రామాలన్ని రాకపోకలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దెబ్బతిన్న రోడ్లు..

జిల్లాలో కురుస్తున్న ఏకధాటి వర్షాలతో భారీ నష్టం వాటిల్లుతోంది. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ ఇరిగేషన్ శాఖలు వర్షాలతో తీవ్రంగా నష్టపోయాయి. పంచాయతీ రాజ్ శాఖ , ఆర్అండ్‌బీ శాఖల పరిధిలో దాదాపు వంద కిలో మీటర్ల పొడవు గల రోడ్లు దెబ్బతినగా పలు చోట్ల వంతెనలకు నష్టం వాటిల్లింది. ఈ రెండు శాఖల పరిధిలో అధికారులు దాదాపు కోటి రూపాయలతో మరమత్తుల కోసం అంచనాలు రూపొందించారు. దీంతో పాటు ఇరిగేషన్ శాఖ అధికారరులు సైతం తమ పరిధిలోని చెరువులు, ట్యాంక్ బండ్‌లు తదితర వాటి మరమత్తుల కోసం రూ. 5.38 కోట్లతో అంచనాలు రూపొందించి సర్కారుకు నివేదించారు. జిల్లాలోని చాలా చోట్ల వరి, పత్తి పంటలు వర్షాల కారణంగా నీట మునిగాయి. ఖరీఫ్ పంటలకు సాగునీటి పరంగా ఈ వర్షాలు తోడ్పడుతున్నప్పటికీ అదేస్థాయిలో నష్టాన్ని సైతం చేకూర్చుతున్నాయని అంటున్నారు.

ప్రాజెక్టుల్లోకి వరద

జిల్లాలోని కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టుల్లోకి ఎగువ నుంచి పెద్దఎత్తున వరద నీరు ప్రవహిస్తోంది. కడెం ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 4.699 టీయంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 3.472 టీయంసీలుగా ఉంది. ఎగువ నుంచి దాదాపు 14వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ఈ ప్రాజెక్టుకు సంబందించిన నాలుగు గేట్లను పైకేత్తి దిగువకు 22,648 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అలాగే స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.37 టీయంసీలుగా కాగా ప్రస్తు తం 0.865 టీయంసీలుగా ఉంది. ఎగువ నుంచి వరద పెరుగుతున్న కారణంగా ప్రాజెక్టుకు సంబందించిన రెండు గేట్లను పైకేత్తి 9వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే గడ్డెన్న వాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.83 టీయంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 1.772టీయంసీలుగా ఉంది. మూడువరద గేట్లను పైకేత్తి దిగువన ఉన్న సుద్దవాగులోకి 13వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

పాపన్నగౌడ్ సేవలు చిరస్మరణీయం : కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్ /ఖానాపూర్ ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సర్దార్ పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్దార్ పాపన్న గౌడ్ సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడని కలెక్టర్ పేర్కొన్నారు. కుల, వర్ణ బేదాలు లేకుండా సమానత్వాన్ని నమ్మిన పాపన్న గౌడ్ బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక సమానత్వానికి విశేష కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, సీపీవో జీవరత్నం, డీటీవో సరోజ, గౌడ సంఘం నాయకులు ముఖ్యం రామకృష్ణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సభ్యులున్నారు.

పోరాట యోధుడు


విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

● ఖానాపూర్ : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గొప్ప పోరాట యోధుడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ కొనియాడారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్‌చౌక్‌లో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు జక్కుల సత్తయ్య, పి.అనిల్ రావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు దాసరి శ్రీనివాస్, కే.రమేష్, ఉపాధ్యక్షుడు సురేందర్, శ్రీనివాస్, శ్రావణ్‌లున్నారు.

సిద్ధాపూర్ వంతెన పరిశీలన


బ్రిడ్జిని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత

నిర్మల్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిద్ధాపూర్ - కౌట్ల(కే) గ్రామాల మధ్య గల బ్రిడ్జిని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. స్వర్ణప్రాజెక్టు వరద నీటి ఉధృతి ద్వారా బ్రిడ్జి కొంత మేర పగుళ్లు ఏర్పడిందని అన్నారు. పురాతన బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేసే విధంగా నివేదిక రూపొందించి పంపాలని ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

సారంగాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో గల స్వర్ణ ప్రాజెక్టును పరిశీలించి జలాశయం నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు పరిస్థితులను విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకొని మత్స్యకారులు పశువుల కాపారులు నది పరివాహక ప్రాంతాల వైపు వెళ్ళవద్దని హెచ్చరికలు జారీ చేశారు. కూలిపోయిన వంతెనను పరిశీలించి ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాజేశ్‌మీన, సీఐ కృష్ణ, ఎస్సై శ్రీకాంత్, ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్, ఏఈ వేణుగోపాల్, ఇరిగేషన్ వాఖ అధికారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పల్లెల్లో రవాణా అస్తవ్యస్తం


భైంసా సుద్దవాగువంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


స్పిల్‌వే వద్ద కట్టిన తాళ్లు

సారంగాపూర్/భైంసా/కడెం/పెంబి , ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల స్వర్ణ ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో నాలుగు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు మొత్తం నీటి సామర్థ్యం 1183 అడుగులకు గాను 1183 అడుగుల వరద నీరు వచ్చి చేరడంతో సోమవారం ఉదయం ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి 9వేల క్యూసెక్కుల వరద నీరును దిగువ ప్రాంతానికి వదిలి పెట్టినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 4వేల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. దీంతో స్వర్ణ వాగు పరివాహక ప్రాంత రైతులు కూలీలు అప్రమత్తముగా ఉండాలని అధికారులు తెలిపారు. కురిసిన వర్షానికి పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● వాహనాల రాకపోకలు నిలిపివేత

భైంసా : ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల మూలంగా సోమవారం ప్రాజెక్టులోకి అధిక మొత్తంలో వరద నీరు వచ్చి చేరింది. ఈ క్రమంలో ప్రాజెక్టు నీటి మట్టం, వరద నీటి చేరికలకు అనుగుణంగా అధికార యంత్రాంగం సుద్దవాగులోకి వరద నీటి విడుదల చేపట్టింది. గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి వదిలిపెట్టిన 16వేల క్యూసెక్కుల వరద నీరు ఇక్కడి సుద్దవాగు బైపాస్ రోడ్డు వంతెనను ముంచెత్తింది. వరద నీరు వంతెనపై నుంచి ఉధృతితో ప్రవహించడం మూలంగా రాకపోకలు నిలిచిపోయాయి. భైంసాటౌన్ సీఐ గోపినాథ్ బైపాస్ రోడ్డు పరిస్థితిని సమీక్షించి రాకపోకలను నిలిపివేయించారు. ప్రమాదాలకు చోటు లేకుండా ఉండేందుకు గాను బైపాస్ రోడ్డు వంతెనకు ఇరువైపులా పోలీసు బందోబస్తును ఏర్పాటుచేసి రాకపోకలను కట్టడి చేశారు.

సెల్ఫీలతో ప్రమాదం..

సందర్శకుల సెల్ఫీల జోరుతో గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. మూడురోజులుగా ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి సుద్దవాగులోకి నీటి విడుదల కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రాజెక్టు వద్ద సందర్శకుల తాకిడి అధికమయింది. ఇదే క్రమంలో సందర్శకులు స్పిల్ వే సమీపానికి చేరుకొని అక్కడి వరద గేట్ల నుంచి ఉధృతితో ప్రవహించే వరద నీరు కనిపించే రీతిలో సెల్‌ఫోన్ల ద్వారా సెల్ఫీలు, గ్రూప్ ఫోటోలు దిగుతున్నారు. దీంతో స్పిల్ వే వద్ద సందర్శకులు సెల్ఫీ ,గ్రూప్ ఫోటోల మోజుతో నెలకొంటున్న ప్రమాదకర పరిస్థితులను నియంత్రించేందుకు పోలీసుశాఖ అప్రమత్తంగా వ్యవహరించింది. ప్రమాదాలకు చోటు లేకుండా ఉండేందుకు గాను ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం భైంసా టౌన్ పోలీసు సీఐ గోపినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు స్పిల్ వే వైపు సందర్శకులు వెళ్లకుండా తాళ్లను కట్టివేశారు.

కడెంకు మళ్లీ వరద

కడెం : కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో అధికారులు ఆరుగేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 15,253 క్యూసెక్కులు రావడంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తి దిగువకు అవుట్ ఫ్లో 22,919 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700ల అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 694.700ల అడుగులు ఉందని అధికారులు పేర్కొన్నారు. దిగువ గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు, గొర్రెల కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు కోరారు.

రైతులను ఆదుకోవాలి

పెంబి: రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీవర్షాలకు కడెం వాగు, దొత్తివాగు, పల్కేరు వాగు పొంగిపొర్లుతున్నాయి. దీంతో మండలంలోని దాదాపు 20 గ్రామాలు పసుపుల, హరిచంద్ తండా, తులసిపేట, గుమ్మెన, ఎంగ్లాపూర్, వస్‌పల్లి, దొందారి, రాంనగర్, యాపల్‌గూడ, సత్తుగూడ, వెంకం పోచంపాడ్, రాయదారి, అంకెనా, కర్ధంలొద్ది, నాయికపు గూడ, తదితర గ్రామాలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతర్య గ్రామానికి చెందిన సపావత్ పరుశురాం 7 ఎకరాలు పత్తి పంట, గడ్డం భీమేష్ 2 ఎకరాలు పంట వేయగా మొత్తం కొట్టుకుపోయిందని, వాగు ఉధృతికి పంట నీట మునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


లోతర్య నుంచి తాటిగూడ సమీపంలో కొట్టుకుపోయిన రోడ్డు


కడెం ప్రాజెక్టు వద్ద నీటి విడుదల

జాగ్రత్తగా ఉండాలి

ముథోల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్ప పీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రమంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ వినియోగదారులు, రైతులు తగు జాగ్రత్తగా ఉండాలని సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సాల్యా నాయక్ ఒక ప్రకటనలో కోరారు. అధిక వర్షాలు కురియడం వలన వినియోగదారులు తడి బట్టలు, తడి చేతులతో విద్యుత్ తీగలు, స్విచ్‌లను తాకవద్దన్నారు. తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలక్ట్రిక్ తీగలు, ఇతర పరికరాలను ముట్టుకోవద్దని తెలిపారు. వాటికి విద్యుత్ ప్రవహిస్తుందని, తడి చేతులతో ఎలక్ట్రిక్ స్విచ్ ఆన్/ఆఫ్ చేయవద్దని, ఇళ్లల్లో తడి నేలపై ఎలక్ట్రిక్ తీగలు, పరికరాలు పడకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇళ్లల్లో బట్టలు ఆరవేసే జీఐ దండెము, వైర్ల వలన విద్యుత్ వైర్లలో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడం వలన దండెములకు విద్యుత్ సరఫరా అయ్యి షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

యూరియా కొరత లేదు : కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.... జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులకు అవసరమైన ఎరువులు తగినంతగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డైవర్షన్ జరగకుండా బార్డర్ చెక్‌పోస్టుల వద్ద పోలీస్, నిరంతరం పర్యవేక్షణ జరుగుతోందని చెప్పారు. రైతులకు ఎరువులు సులభంగా అందేలా షాపులను ఉదయం నుంచే తెరిచి ఉంచుతున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, సీపీవో జీవరత్నం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నష్టంపై నివేదికలు సిద్ధం చేయండి

నిర్మల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టంపై విభాగాల వారీగా పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అభిలాష అభివన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన నేపథ్యంలో భారీవర్షాల కారణంగా జరిగిన నష్టంపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు, వంతెనలు, పంటలు, నివాస గృహాలు దెబ్బతిన్న ప్రాంతాలను తక్షణం సర్వే చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జడ్పీ సీఈవో గోవింద్, సీపీవో జీవరత్నం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఉన్నారు.

ఎడతెరిపి లేని వర్షం


సదర్మాట్ ఆనకట్ట వద్ద గోదావరి నది ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

ఖానాపూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్, కడెం ప్రాంతాలలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు రావడంతో కడెం ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతుండడంతో అధికారులు తొలుత నాలుగు గేట్లను ఎత్తిదిగువకు నీటిని వదిలారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో సుమారు 46,759 క్యూసెక్కులకు పెరగడంతో ప్రాజెక్టు ఆరు వరద గేట్లను ఎత్తి దిగువకు 34,193 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700ల అడుగులు కాగా ప్రస్తుతం 694.675 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.699 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.440 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. కాగా ఎగువ ప్రాంతం నుంచి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు గేట్లను మరిన్ని ఎత్తే అవకాశం ఉన్నందున గోదావరి నది పరివాహక ప్రాంతాలకు ఎవరు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. గోదావరి నదిలోకి వరద ఉధృతి పెరిగింది.